# ములుగు సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

## కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి జంపన్నవాగు, మల్లూరు ఆలయ అభివృద్ధికి హామీ

**ములుగు జిల్లా, ఆగస్టు 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ములుగు జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సమ్మక్కసారలమ్మ ఆశీస్సులతోనే ములుగు నుంచి పాదయాత్ర ప్రారంభించామని సీఎం గుర్తుచేశారు. రాష్ట్ర నలుమూలలా ప్రతి గూడెం, ప్రతి పల్లెకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి భరోసా కల్పించామని, ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని పేర్కొన్నారు. ములుగు ప్రజలకు అక్కగా మంత్రి సీతక్క నిరంతరం అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. మేడారం సమ్మక్కసారలమ్మ ప్రాంగణాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామని, రామప్ప, వేయి స్తంభాల గుడి తరహాలో మేడారాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. **మల్లూరు ఆలయానికి నిధులు.. జంపన్నవాగు అభివృద్ధి** మల్లూరు నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని సీఎం ప్రకటించారు. జంపన్నవాగును నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తామని, భక్తులు, పర్యాటకులు, స్థానిక ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆదివాసీ బిడ్డలు కష్టానికి మారుపేరని, వారి కష్టాలు తీరాలంటే ఈ ప్రాంతానికి సాగునీరు అందాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. **యువతకు నైపుణ్య విద్యపై ప్రత్యేక దృష్టి** ఆదివాసీ యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రేవంత్ రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 12వ తరగతి అనంతరం నైపుణ్య విద్యను అభ్యసించాలని సూచించారు. నైపుణ్యం ఉంటే జపాన్, జర్మనీ వంటి దేశాల్లో అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జర్మన్, జపనీస్, కొరియన్ వంటి విదేశీ భాషల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. **ఆడబిడ్డల సంక్షేమానికి ప్రాధాన్యత** మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను సారెగా అందిస్తున్నామని, ఈ ఏడాది చిలకపచ్చ రంగు చీరలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రక్తం పంచుకుని పుట్టకపోయినా సీతక్కను ఆడబిడ్డగా గౌరవిస్తున్నానని సీఎం అన్నారు. మరోవైపు రక్తం పంచుకుని పుట్టిన సోదరిని ఆస్తి కోసం ఇంటి నుంచి పంపించిన వారు తెలంగాణ ఆడబిడ్డలకు ఎలా మేలు చేస్తారని ప్రశ్నించారు. కొడుకుకు బుద్ధి చెప్పాల్సిన తండ్రి ఫామ్‌హౌస్‌లో పడుకున్నాడంటూ ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేశారు. అదేవిధంగా అఘోరా పూజలపై కూడా సీఎం విమర్శలు చేశారు. ప్రజలు ఇబ్బందులు పడాలని కొందరు కోరుకున్నారని, అయితే దేవుడు ప్రజల వైపు ఉన్నాడని, రాష్ట్రంలో వర్షాలు కురిపించాడని అన్నారు. "మీరు అండగా ఉండండి.. మన రాష్ట్రాన్ని మనమే బాగు చేసుకుందాం.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందాం" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. **ములుగు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత: మంత్రి సీతక్క** ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ములుగు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం



ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన నిధులు కేటాయించి పనులను వేగవంతం చేస్తోందన్నారు. ములుగు నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. **సాగునీటి ప్రాజెక్టులకు రూ.200 కోట్లు** సాగునీటి రంగంలో రూ.200 కోట్లతో పోట్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్, రామప్పలక్నవరం అనుసంధాన పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సీతక్క తెలిపారు. ఈ పనులు పూర్తయితే రైతులకు సాగునీటి లభ్యత మెరుగుపడి వ్యవసాయ రంగానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. సమ్మక్కసారలమ్మ సన్నిధి అభివృద్ధితో పాటు విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నర్సింగ్ కళాశాలల ఏర్పాటు, వైద్య విద్యా సదుపాయాల విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. **తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు** గత పాలకులు ఎన్నికల సమయంలో శంకుస్థాపనలు చేసి, అనంతరం నిధులు కేటాయించకుండా పనులను నిలిపివేశారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు విడుదల చేసి నిలిచిపోయిన పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని, ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరారు. ములుగు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. **కలెక్టరేట్‌తో ప్రజలకు మెరుగైన సేవలు** ములుగు జిల్లా కలెక్టరేట్ సముదాయం అందుబాటులోకి రావడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే ఎస్పీ కార్యాలయం, కోర్టు భవనాల నిర్మాణాలను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీలు బలరాం నాయక్, వేం రెడ్డి నరేందర్ రెడ్డి, విప్ డా. రాంచంద్ర నాయక్, ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థి సంక్షేమానికి వెలమ సంక్షేమ సంఘం పెద్దపీట

## రూ.12.20 లక్షల స్కాలర్‌షిప్‌లు.. 215 మంది విద్యార్థులకు ఆర్థిక చేయూత

## 65 మంది ప్రతిభావంతులకు అవార్డులు.. విద్యార్థుల ఉన్నత విద్యకు సంఘం భరోసా

**హనుమకొండ, ఆగస్టు 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం చేపట్టిన ప్రతిభా పురస్కారాలు స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం వీఎస్‌ఎస్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, సంఘ ప్రతినిధులు, ప్రముఖులతో కళకళలాడిన ఈ కార్యక్రమం సేవా భావానికి, విద్యా ప్రోత్సాహానికి నిదర్శనంగా నిలిచింది. వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్ మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యలో విశిష్ట



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేయడంతో పాటు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా 65 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, 215 మంది విద్యార్థులకు మొత్తం రూ.12,20,000 విలువైన స్కాలర్‌షిప్‌లు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే కాకుండా, వారి ఉన్నత విద్యకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడం ద్వారా వెలమ సంక్షేమ సంఘం మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. ముఖ్య అతిథి ఎన్నమనేని జగన్ మోహన్ రావు మాట్లాడుతూ, విద్య అనేది వ్యక్తిగత ప్రగతికే కాకుండా సమాజాభివృద్ధికి కూడా మూలస్తంభమని అన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును



మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి రాకూడదని, అలాంటి విద్యార్థులకు చేయూతనందించడం ప్రతి సామాజిక సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అధ్యక్షులు డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, వెలమ సంక్షేమ సంఘం గత ఎన్నో ఏళ్లుగా విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించడం సంఘం ప్రధాన ధ్యేయమని, భవిష్యత్తులో మరింత ఎక్కువ మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు, సేవా దృక్పథంతో ముందుకు



సాగాలని సూచించారు. స్కాలర్‌షిప్‌లు, పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వెలమ సంక్షేమ సంఘానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం తమ విద్యాభ్యాసానికి ఎంతో తోడ్పడుతుందని, ఇలాంటి ప్రోత్సాహం తమలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, ప్రముఖులు, దాతలు, 500 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం అన్ని వర్గాల ప్రశంసలను అందుకుంది. భవిష్యత్తులోనూ విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని సంఘం ప్రతినిధులు తెలిపారు.

# ప్రజాసేవలో సండ్రకు ప్రత్యేక గుర్తింపు



## మాజీ ఎమ్మెల్యే సండ్రను ఘనంగా సత్కరించిన బీఆర్ఎస్ నాయకులు

## ఈర్ష్యా ద్వేషాలతో తప్పుడు ప్రచారం చేయడం తగదు బీఆర్ఎస్ నాయకులు

**కల్లూరు, ఆగస్టు 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జన్మదినం సందర్భంగా కల్లూరు మండల బీఆర్ఎస్ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని సండ్ర నివాసానికి వెళ్లిన నాయకులు



ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి, బోకేలు, స్వీట్లు అందజేశారు. సండ్ర వెంకటవీరయ్య తిరుమల దైవదర్శనం ముగించుకుని తిరిగి వచ్చిన నేపథ్యంలో ఈరోజు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజల ఆదరణతో వరుసగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా సండ్ర వెంకటవీరయ్య ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధినే ధ్యేయంగా, ప్రజాసేవనే లక్ష్యంగా పనిచేస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన నాయకుడిగా సండ్రకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. **ఈర్ష్యతో విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరు** ఇటీవల కొందరు నాయకులు సండ్ర వెంకటవీరయ్యపై ఈర్ష్యా ద్వేషాలతో తప్పుడు ప్రచారం చేస్తూ, చౌకబారు వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు ఘాటుగా విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక వ్యక్తిగత విమర్శలకు దిగడం వారి కుసంస్కారానికి నిదర్శనమని మండిపడ్డారు. సండ్ర చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సేవలపై మాట్లాడకుండా నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా ప్రజల ముందు వారే చులకనవుతున్నారని అన్నారు. ఎన్ని విమర్శలు చేసినా ప్రజల మద్దతుతో సండ్రకు ఉన్న గుర్తింపును చెరిపివేయడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కల్లూరు మండల అధ్యక్షులు పాలేపు రామారావు, మాజీ సొసైటీ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మేకల కృష్ణ, మైనార్టీ నాయకులు సయ్యద్ రవూఫ్, కల్లూరు మున్సిపల్ కౌన్సిలర్లు ఇస్మాయిల్, సయ్యద్ రేష్మ ఇంతియాజ్, బీఆర్ఎస్ మండల నాయకులు కొరకొప్పు ప్రసాద్, కట్టా అర్లప్ప, పాలడుగు శంకర్‌రావు, బొల్లం వెంకటేశ్వర్లు, జర్పుల రాములు, జాకీర్ నవాబ్, శిరసాని రాజు, సన్నీ, శ్రీను పాల్గొన్నారు.



# సామాజిక ప్రజాస్వామ్య పరిరక్షణకు కలంగళం కదలాలి










**- ప్రజాస్వామ్య విలువలు, మానవీయత, సాంస్కృతిక స్వేచ్ఛను కాపాడేందుకు రచయితలు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు బాధ్యతగా ముందుకు సాగాలి**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో మనిషి గౌరవంగా, స్వేచ్ఛగా, సమానత్వంతో జీవించేందుకు ప్రజాస్వామ్యమే బలమైన పునాది అని, ఆ పునాది బలహీనపడకుండా కాపాడే బాధ్యత రచయితలు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు, మేధావులపై ఉందని సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభ వక్తలు పిలుపునిచ్చారు. ప్రజల కన్నీటిని అక్షరాలుగా, వారి ఆకాంక్షలను గళంగా, సమాజపు బాధలను కళారూపాలుగా మలిచి మానవీయ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఆదివారం ఖమ్మంలో ఫోరం రెండో రాష్ట్ర మహాసభలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సామాజిక సాహితీవేత్త మెట్టు రవీందర్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో సామాజిక అధ్యయనవేత్త డాక్టర్ గోపినాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలు, ప్రభుత్వాల మార్పుతో పూర్తయ్యే ప్రక్రియ కాదని, అది ప్రతి మనిషి హక్కును, గౌరవాన్ని, స్వేచ్ఛను కాపాడే జీవన విలువగా నిలవాలని అన్నారు. ప్రస్తుతం ప్రజాస్వామ్య విలువలు ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదని, ఈ పరిణామాలను రచయితలు, కవులు లోతుగా గమనించి తమ సృజన ద్వారా సమాజాన్ని చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. 'ప్రజాస్వామ్యంసాంస్కృతిక సంభాషణ' అంశంపై జరిగిన సమావేశంలో ప్రముఖ కవయిత్రి మెర్సీ మార్గరెట్ సదస్సు ప్రస్తావన చేశారు. కథకుడు దాదా హయత్, కవివిమర్శకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ ప్రారంభోపన్యాసాలు చేశారు. దేశంలో చోటుచేసుకుంటున్న సామాజిక, సాంస్కృతిక పరిణామాలను యువత ఏ విధంగా అర్థం చేసుకుంటున్నదీ వారు వివరించారు. విద్యాసాగర్, రూపా రుక్మిణి సమూహ లక్ష్యాలను వివరించారు. 'ప్రజాస్వామ్యంపౌరసత్వ సమస్య' అంశంపై కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్ అధ్యక్షతన చర్చ జరిగింది. ఎస్. మల్లారెడ్డి, ప్రముఖ సామాజిక విశ్లేషకురాలు జహాఆరా పౌరసత్వ అంశంపై విస్తృతంగా ప్రసంగించారు. ధరణికోట రమేష్‌కుమార్, ఫణిమాధవి, నాలేశ్వరం శంకరం తమ అభిప్రాయాలను వెల్లడించారు. 'సాహిత్యంలో బహుళ అస్తిత్వాలుప్రజాస్వామిక దృక్పథం' అంశంపై జరిగిన సమావేశంలో ప్రముఖ కవి, రచయిత సుంకిరెడ్డి నారాయణరెడ్డి, జిలుకర శ్రీనివాస్, షాజహానా, గాజోజి నాగభూషణం, తోటి సుభాషిణి మాట్లాడారు. విభిన్న అస్తిత్వాలు, అణగారిన గొంతులు, సామాజిక అసమానతలకు సాహిత్యం అద్దం పట్టాలని, అక్షరం ప్రజల పక్షాన నిలిచినప్పుడే దానికి నిజమైన సార్థకత ఉంటుందని వారు పేర్కొన్నారు. 'వర్తమాన సాహిత్య సందర్భంసమూహ ఆచరణ'పై జరిగిన చివరి సమావేశంలో కవి సీతారాం, స్కైబాబ, ఇబ్రహీం, నిర్గుణ్, సునంద తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సాహిత్యం సమాజానికి దూరంగా కాకుండా ప్రజల జీవితాలతో మమేకం కావాలని, బాధితుల పక్షాన నిలబడి వారి గొంతుకగా మారాలని పిలుపునిచ్చారు. అనంతరం భూపతి వెంకటేశ్వర్లు సదస్సు నివేదికను సమర్పించారు. ఫోరం నూతన కార్యవర్గ సభ్యుల పేర్లను, భవిష్యత్ కార్యాచరణను కాత్యాయని విద్మహే, ఏ.కె. ప్రభాకర్ ప్రకటించారు.

**కలం ప్రజల పక్షాన... గళం ప్రజాస్వామ్యం కోసం**

ప్రజాస్వామ్యం బలంగా ఉంటేనే భిన్నాభిప్రాయాలకు చోటుంటుందని, ప్రశ్నించే హక్కు, మాట్లాడే స్వేచ్ఛ, ఆలోచించే స్వాతంత్ర్యం సురక్షితంగా ఉంటాయని వక్తలు పేర్కొన్నారు. అధికారాన్ని ప్రశ్నించే కలం భయపడకూడదని, అన్యాయాన్ని చూసి కళ మౌనంగా ఉండకూడదని, ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిజం తన సామాజిక బాధ్యతను మరువకూడదని సూచించారు. మనిషి కన్నీటిని తుడిచే అక్షరం కావాలి...అణచివేతను ప్రశ్నించే గళం కావాలి...అసమానతను ఎదురించే కళ కావాలి...ప్రజాస్వామ్యాన్ని కాపాడే జర్నలిజం కావాలి. ప్రజల పక్షాన నిలిచే సాహిత్యం, మానవీయ విలువలను ప్రతిబింబించే కళలు, నిజాన్ని నిర్భయంగా చెప్పే జర్నలిజం కలిసినప్పుడే సమాజంలో సామాజిక ప్రజాస్వామ్యానికి బలమైన పునాది ఏర్పడుతుందని మహాసభ స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన కవులు, రచయితలు, కళాకారులు, ఆలోచనాపరులు, జర్నలిస్టులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆదరణ తగ్గిపోతున్న బోనాల పండుగ




**- బోనాలతో బారులు తీరిన మహిళలు.**

**- రెండు కల్లు ముంతల కావడితో దర్శనం ఇచ్చిన చిన్నోడు.**

**- తాజా ఉప సర్పంచ్ పంజాల మహేష్ తో మాజీ సర్పంచ్ వి బాలకృష్ణ గ్రామస్తులు బృందం.**

**- ముత్యాలమ్మ గుడి వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు.**

**- నీరు లేక ఎడారిలా మారిన ఆకేరు జలపాతం(వాగు).**









**తొర్రూరు ప్రతినిధి,ఆగస్టు 16(పీసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీలో ఆదివారం బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఒకనాటి బోనాల పండుగ అంటే ప్రతి గ్రామంలో ముత్యాలమ్మ దేవతకి ప్రతి ఇంటి నుండి నైవేద్యాన్ని వండి దీపాన్ని వెలిగించి గ్రామంలోని దేవాలయం వరకు పాదయాత్రగా వెళ్లి మొక్కులు సమర్పించుకుంటారు మహిళలు. పాడిపంట ఉన్న రైతులందరూ వారి ఇంటిలో ప్రతి ఇంటికి కాడి ఎద్దులను ముస్తాబు చేసి ఎడ్ల బండికి రంగురంగుల కాగితాలు , కాడి ఎద్దులకు గజ్జలు పట్టీలు రంగురంగులు పోసి ఇంటి నుండి ఎడ్ల బండి పోటీలతో ముత్యాలమ్మ గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి తిరిగి ఇంటికి వచ్చేవారు. ఆనాటి ఎడ్ల బండ్లు కనుమరుగై నేడు రైతులకు ట్రాక్టర్లు మాత్రం అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం పొలం పనుల నిమిత్తం వాటిని కూడా ముస్తాబు చేయకుండా ముత్యాల గుడి వరకు కూడా వెళ్లేవారు కరువైపోయారు.గ్రామంలోని ఒక చిన్నారి పంజాల శివంత్ బోనాల పండుగలో తన రెండు ముంతలతో కల్లు నింపుకొని భుజాన కావడి తెచ్చుకొని ముత్యాలమ్మ గుడి వరకు ప్రయాణం కొనసాగించాడు. ప్రతి ఒక్కరికి ఈ దృశ్యం కనువిందు చేసినట్లుగా కనిపించిందని చిన్నారి కి తమ ఆశీస్సులు అందజేశారు. ముత్యాలమ్మ గుడి వద్ద పరిసర ప్రాంతాలలో మహిళలకు ఇబ్బంది కలగకుండా గ్రామ సర్పంచ్ వి కవితా బాలకృష్ణ వీధి దీపాలను ఏర్పాటు చేసి పరిసర ప్రాంతాలలో అపరిశుభ్రం లేకుండా రహదారిని నిర్మింప చేశారు. బోనాల పండుగను తిలకించేందుకు గ్రామస్తులతో పాటు ప్రస్తుత తాజా ఉపసర్పంచ్ పంజాల మహేష్ తో మాజీ సర్పంచ్ బాలకృష్ణ గ్రామస్తులు కలిసి ముత్యాలమ్మ దేవత మొక్కు తీర్చుకున్నారు. ముత్యాలమ్మ గుడి చుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రపరచి ఎవరికి ఇబ్బంది కలగకుండా గ్రామ సిబ్బందిని నియమింపజేసి ఎప్పటికప్పుడు ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకునేందుకు అన్ని విధాల ఏర్పాటుచేసిన గ్రామ సర్పంచ్ వి కవిత బాలకృష్ణ కు గ్రామ మహిళలందరూ కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనకు టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్ర

**- సుబ్లేడులో షోయబుల్లా ఖాన్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభం**

**- నియోజకవర్గాల వారీగా మండలాల్లో కొనసాగనున్న యాత్ర**

**- విజయవంతం చేయాల్సిందిగా జర్నలిస్టులకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి పిలుపు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకోసం ఈనెల 22వ తేదీ నుంచి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్ – 2843) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించినట్లు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా ఆయా మండలాల్లో పాదయాత్ర నిర్వహించాలని తలపెట్టినట్లు చెప్పారు. నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన జర్నలిస్టు, కవి షోయబుల్లా ఖాన్ వర్ధంతిని పురస్కరించుకొని పాలేరు నియోజకవర్గం, తిరుమలాయపాలెం మండలం, సుబ్లేడు గ్రామంలోని అయన విగ్రహం వద్ద నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమవుతుందని వివరించారు. సుబ్లేడులో మొదలయ్యే ఈ పాదయాత్ర అక్కడి నుంచి నేరుగా తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండల కేంద్రాలతో పాటు ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీలో కొనసాగుతుందని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని జర్నలిస్టులతో కలిసి సాగే ఈ పాదయాత్రకు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు జర్నలిస్టులకు సంఘీభావం తెలపాల్సిందిగా కోరారు. ఇళ్ల స్థలాల సాధనకోసం నియోజకవర్గాల వారీగా సాగే ఈ పాదయాత్రను విజయవంతం చేయాల్సిందిగా జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్



**తొర్రూరు ప్రతినిధి,ఆగస్టు 16(పీసిడబ్ల్యూ న్యూస్):** పరకాల నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా. జాటోత్ రామచంద్ర నాయక్ ఘన స్వాగతం పలికారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రితో కొద్దిసేపు మర్యాదపూర్వకంగా మాట్లాడారు.ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై నాయకుల మధ్య చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

